క్లుప్తంగా

'మమ్మల్ని కొనసాగించండి'



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న వలంటీర్లు

గుత్తి: గత ప్రభుత్వంలో మాదిరిగానే కొత్త ప్రభుత్వంలో కూడా తమను కొనసాగించాలని వార్డు వలంటీర్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులుకు విన్నవించారు. ఈ మేరకు గతంలో రాజీనామా చేసిన 47 మంది బుధవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని కమిషనర్ హామీ ఇచ్చారు.

సచివాలయాల తనిఖీ



వార్డు సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని 5, 11 వార్డు సచివాలయాలను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పని తీరుపై ఆరా తీశారు. సమయ పాలన పాటించాలని, విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు. అనంతరం పలు ప్రాంతాల్లోని డ్రైనేజీలను పరిశీలించారు. జేసీబీ, గ్యాంగ్‌వర్క్ ద్వారా డ్రైనేజీలను శుభ్రం చేయిస్తామని కమిషనర్ చెప్పారు.

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోండి



ఎంఈఓ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

గుత్తి: అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలల యజమానులపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎంఈఓ కార్యాలయం వద్ద ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాల యాజమానులపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రవి, బాలాజీ, వినయ్, ఈశ్వర్, గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులందరికీ సభ్యత్వం ఇవ్వాలి

గుత్తి: గుత్తి కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంకులో ఖాతాదారులందరికీ సభ్యత్వం ఇవ్వాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బీజేపీ ముస్లిం మైనార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు వలి బాషా ఆధ్వర్యంలో పలువురు బీజేపీ నాయకులు బుధవారం సీఈఓ మహేశ్వర ప్రసాద్, బ్యాంకు అధికారులతో పాటు బ్యాంకు చైర్మన్ అబ్దుల్ జిలాన్‌ను కలిశారు. ఖాతాదారులందరికీ సభ్యత్వం ఇవ్వకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తెగదొడ్డి తిమ్మారెడ్డి, చేనేత సెల్ జిల్లా అధ్యక్షులు మనోహర్, జిల్లా నాయకులు రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

డయేరియా ప్రబలకుండా చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న సీడీపీఓ డిల్లీశ్వరి

గుత్తి: డయేరియా ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సీడీపీఓ డిల్లీశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్ లాజరస్ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం అంగన్వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణ మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులైన డయేరియా, మలేరియా, టైఫాయిడ్, డెంగీ వ్యాప్తి చెందుతున్నాయన్నారు. అందరూ కలిసి కట్టుగా సీజనల్ వ్యాధుల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సూపర్‌వైజర్లు గౌరి, నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్‌లే దిక్కు!

- కీలక పోస్టులన్నీ ఖాళీ
- ముందుకు సాగని పాలన
- ప్రజలకు తప్పని ఇబ్బందులు

యల్లనూరు: మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో ఇన్‌చార్జ్‌లే దిక్కుగా మారారు. ప్రధానంగా రెవెన్యూ, పోలీసు, పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ముఖ్యమైన అధికారులు లేకపోవడంతో పాలన ముందుకు సాగడం లేదు. ప్రజలకు సకాలంలో పనులు జరగకపోవడంతో కార్యాలయాలు చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఉన్న అధికారులపై పని ఒత్తిడి పెరగడంతో బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రశ్నార్థకంగా శాంతిభద్రతలు

యల్లనూరు మండలంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే అత్యంత సమస్యాత్మక ప్రాంతంగా గుర్తింపు పొందింది. ఇలాంటి ప్రాంతంలో ఎస్‌ఐ పోస్టు ఖాళీగా ఉండటంతో శాంతిభద్రత పరిరక్షణ ప్రశ్నార్థంగా మారింది. యల్లనూరు ఎస్‌ఐ గిరిబాబు ఎన్నికల కన్నా ముందు వచ్చి 10 రోజుల కిందట సిక్ లీవ్‌లో వెళ్లిపోయారు. దీంతో మండల బాధ్యతలను పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం చూస్తున్నారు. చిన్నపాటి గొడవ జరిగినా సీఐ వెళ్లాల్సిన పరిస్థితి. శాంతి భద్రతల సమస్య తలెత్తకముందే ప్రభుత్వం మేలుకోవాల్సిన అవసరం ఉంది.

బాధ్యతలన్నీ డిప్యూటీ తహసీల్దార్‌కే..

తహసీల్దారు కార్యాలయంలో సీఎస్‌డీటీ, రీ సర్వే డీటీ, ఆర్‌ఐ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎన్నికల ముందు ఆర్‌ఐగా విధులు నిర్వహిస్తున్న హరిప్రసాద్ డిప్యుటేషన్‌పై ఉరవకొండకు వెళ్లిపోయారు. దీంతో డిప్యూటీ తహసీల్దార్ శ్వేతకు సీఎస్‌డీటీ, రీ సర్వే డీటీ, ఆర్‌ఐ బాధ్యతలు అప్పగించారు. నలుగురు అధికారులు చేయాల్సిన పనిని డిప్యూటీ తహసీల్దార్‌కు అప్పగించడంతో ఆమెకు పనిభారం పెరిగిపోయింది. దీంతో ఆమె సాధారణ బదిలీల్లో వెళ్లిపోయేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

పశు సంవర్ధక శాఖ ఏడీ పోస్టు ఖాళీనే ..

యల్లనూరులో పశు సంవర్ధక శాఖ ఏడీ పోస్టు ఏడాదికి పైగా ఖాళీగానే ఉంది. తాడిపత్రి ఏడీ ఖాదర్‌బాషా ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. తాడిపత్రి నియోజకవర్గ స్థాయిలో ఏడీ కావడంతో ఆయన బిజీగా ఉంటారు. రెగ్యులర్ ఏడీ లేక పాడి రైతులు అవస్థలు పడుతున్నారు. లైవ్‌స్టాక్ అసిస్టెంట్ రేష్మ, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాసులరెడ్డితో పాటు పశు సంవర్ధక అసిస్టెంట్లుతో కాలాన్ని నెట్టుకొస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మండలంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.





ఖాళీగా ఉన్న ఎస్‌ఐ కుర్చీ

పరిశుభ్రతతో రోగాలు దూరం



హాస్టల్‌లో దోమల మందు పిచికారీ చేయిస్తున్న మలేరియా అధికారి శ్రీనివాసులు

పెద్దపప్పూరు: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరిచేరవని మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఆయన జూటూరు కస్తూర్బా పాఠశాల, బీసీ బాలికల వసతి గృహం, పెద్దపప్పూరు బాలుర వసతి గృహంలో దోమల నివారణ కోసం మందు పిచికారీ చేయించారు. ఈసందర్భంగా విద్యార్థులకు దోమల నివారణ చర్యలను వివరించారు. చిన్నపాటి ఆరోగ్య సమస్య వచ్చినా వెంటనే ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించుకోవాలని సూచించారు. అనంతరం దేవునిఉప్పల పాడులో పర్యటించి గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కేజీబీవీ ప్రత్యేకాధికారిణి సరస్వతి, వార్డెన్ వెంకటేశ్వర్లు, ఏఎన్‌ఎం నగీనా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మోంగోడిబి సర్టిఫికేషన్‌లో విద్యార్థుల ప్రతిభ



సర్టిఫికేషన్ విడుదల చేస్తున్న ఆలూరి సాంబశివారెడ్డి

బుక్కరాయసముద్రం: రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్ ఐటీ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ విద్యార్థులు మోంగోడిబి సర్టిఫికేషన్ ప్రోగ్రాంలో ప్రతిభ కనబర్చినట్లు కళాశాల కరెస్పాండెంట్ ఆలూరి సాంబశివారెడ్డి బుధవారం తెలిపారు. విద్యార్థులు ఆధునిక డేటా బేస్ మేనేజ్‌మెంట్‌లో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారన్నారు. మోంగోడిబి ఎస్‌ఆర్‌ఐటీ కళాశాలలో కెరీర్ కోసం విద్యార్థులను సిద్ధం చేయడానికి విలువైన భాగస్వామిగా గుర్తించిందన్నారు. ఈ భాగస్వామ్యం దాని పాఠ్యాంశాల్లో పరిశ్రమ సంబంధిత నైపుణ్యాలను ఏకీకృతం చేయడానికి అంకిత భావాన్ని హైలెట్ చేస్తుందన్నారు. తమ కళాశాల విద్యార్థులు మోంగోడిబి సర్టిఫికేషన్‌లో విజయం సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. విద్యార్థుల అంకిత భావం, నైపుణ్యాలను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా అగ్రశ్రేణి విద్యను అందించడంలో తమ నిబద్ధతను ప్రతిబింబిస్తాయన్నారు. కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ మోంగోడిబి నుంచి వచ్చిన ఈ గుర్తింపు తమ విద్యార్థుల విజయవంతమైన కెరీర్లను సిద్ధం చేయడానికి ప్రయత్నాలను పునరుద్ఘాటిస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ హేమంత్‌కుమార్ యాదవ్, వీర ప్రకాష్, డాక్టర్ చిత్ర లింగప్ప, కొండన్న, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల హాజరు పెంచండి



సిబ్బందితో మాట్లాడుతున్న ఏపీఓ షబ్బీర్‌బాషా

యల్లనూరు: మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పనులకు కూలీల హాజరుసంఖ్య పెంచాలని ఏపీఓ షబ్బీర్‌బాషా సిబ్బందికి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ విధిగా మస్టరు తనిఖీ చేయాలన్నారు. అలాగే హౌసింగ్ 90 రోజులు, పండ్లమొక్కల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పాత, కొత్త పనులపై సమీక్షించారు. టెక్నికల్ అసిస్టెంట్లు జయరాం, శంకర్, అదిల్, శ్రీనివాసులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదాం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లుటౌన్: గుంతకల్లును ఆదర్శ మున్సిపాల్టీగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్.భవాని అధ్యక్షతన అత్యవసర కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎమ్మెల్యేను కౌన్సిల్ సభ్యులు ఘనంగా సన్మానించారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో చిరు వ్యాపారాలు చేసుకునే వారికి సుంకం వసూలు చేయకుండా కౌన్సిల్‌లో తీర్మానం చేయాలని సభ్యులు కోరారు. కమిషనర్ వెంకటరమణయ్య మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో సుంకం వసూలు వేలం ముగిసిందని, వచ్చే ఏడాది ఈ ప్రతిపాదనలను అజెండాలో పొందుపరుస్తామన్నారు. దోనిముక్కల రోడ్డులో అన్యాక్రాంతమైన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకుని అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. కబ్జాదారుల నుంచి స్థలాలను స్వాధీనం చేసుకుంటామని కమిషనర్ చెప్పారు. వార్డుల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, అధ్వానంగా మారిన శానిటేషన్, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని కౌన్సిలర్లు మహాలక్ష్మి, విద్యారాణి, నాగరత్న, కృపాకర్, పవన్‌గౌడ్, ప్రభాకర్,అరుణ, కోఆప్షన్ సభ్యుడు ఫ్లయింగ్‌మాబు కోరారు. కౌన్సిల్ సభ్యులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించడంలో అధికారులు అలసత్వాన్ని వీడాలని, వర్షాకాలం కారణంగా శానిటేషన్‌ను మెరుగుపరచాలని చైర్‌పర్సన్ అధికారులను ఆదేశించారు. అజెండాలో పొందుపరిచిన అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

మొక్కలు నాటిన ఎమ్మెల్యే, చైర్‌పర్సన్

పట్టణంలోని పాత ఎమ్మార్వో కార్యాలయం వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎమ్మెల్యే జయరామ్, మున్సిపల్ చైర్‌పర్సన్ భవానీ, కమిషనర్, కౌన్సిలర్లు పాల్గొని మొక్కలు నాటి నీరు పోశారు.

అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం



కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు

తాడిపత్రి రూరల్: స్థానిక మునిసిపల్ కార్యాలయంలో బుధవారం వైస్ చైర్మన్ అబ్దుల్ రహీం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పలు అభివృద్ధి పనులకు పాలకవర్గం ఆమోదం తెలిపింది. పార్వతీ బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయం వద్దనున్న వాటర్ వర్క్స్, నందలపాడు వాటర్ వర్క్స్ వద్ద పంపింగ్ వాల్వ్స్ కొనుగోలు కోసం 1.67 లక్షల మంజూరుకు అంగీకారం తెలిపారు. పట్టణంలో ప్రస్తుతం ఉన్న వీధిదీపాల స్థానంలో 30 వాల్ట్స్ ఎల్ఈడీ బల్బులను ఏర్పాటు చేసేందుకు రూ.20 లక్షలు జనరల్ ఫండ్స్ నుంచి వినియోగించాలని నిర్ణయించారు. వాటర్ వర్క్స్‌లో క్లోరిన్ గ్యాస్ కోసం రూ.12 లక్షలను మంజూరు చేయడానికి అంగీకారం లభించింది. పట్టణంలోని దినకురగాయల మార్కెట్ వద్ద పార్కింగ్ కోసం వేసిన కంచె, గేట్ కోసం సాధారణ నిధుల నుంచి రూ.2 లక్షలు, అండర్ డ్రైనేజీ మరమ్మతుల నిమిత్తం సెవెర్ రోడ్డింగ్ మిషన్ కొనుగోలు కోసం 7.70 లక్షల మంజూరుకు కౌన్సిల్ అమోదం తెలిపింది. ఇదిలా ఉండగా గొల్లపాలెంలోని సర్ సీవీ రామన్ డిగ్రీ, ఇంటర్ కళాశాలను కాలం చెల్లిన భవనాల్లో నిర్వహిస్తున్నారని, చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ కౌన్సిలర్లు కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు.

టీడీపీ నేతల అరెస్ట్

బుక్కరాయసముద్రం: కొర్రపాడు గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడి చేసిన టీడీపీకి చెందిన ఎంపీటీసీ ఎర్రినాగమ్మ భర్త ఆదినారాయణ, పార్థసారథి, బద్రిలను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితులపై 323, 324, 307, రెడ్ విత్–34 ఐపీసీ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. నిందితులని కోర్టుకు హాజరుపర్చగా జడ్జి వారికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

శింగనమల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యోగేశ్వరి అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ బివి రమణ తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, మండల అధికారులు హాజరుకావాలని కోరారు.

అరబిక్ స్కూల్ స్థలానికి రక్షణ కల్పించండి



మాట్లాడుతున్న ప్రభుత్వ ఖాజీ సయ్యద్ రజాక్‌పీర్ సాబ్

గుంతకల్లుటౌన్: పట్టణంలోని అరబిక్ ఎయిడెడ్ పాఠశాల స్థలాన్ని కాపాడాలని పట్టణ ప్రభుత్వ ఖాజీ సయ్యద్ రజాక్‌పీర్ సాహెబ్, స్కూల్ కమిటీ కార్యదర్శి ఖాసీం కోరారు. బుధవారం స్థానిక స్కూల్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. 55 ఏళ్ల క్రితం పలువురు ముస్లిం పెద్దలు 5.80 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసి అరబిక్ స్కూల్ నిర్మాణానికి దానం చేశారన్నారు. అయితే ఇందులో 80 సెంట్ల స్థలం తమదేనంటూ పాతగుంతకల్లుకు చెందిన కొందరు వ్యక్తులు అధికార పార్టీ ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పుకుని బెదిరింపులకు పాల్పడటం, ఈ స్థలాన్ని విక్రయిస్తామని వ్యాపారులకు చూయిస్తూ అలజడి సృష్టించడం సరికాదన్నారు. గతంలో దీనిపై వివాదం నెలకొన్నప్పుడు మండల, జిల్లా సర్వేయర్ కొలతలు చేపట్టి రికార్డుల ప్రకారం ఈ స్థలం పక్కాగా అరబిక్ స్కూల్‌దేనని ధ్రువీకరించారన్నారు. అయినప్పటికీ కొందరు వ్యక్తులు ఆక్రమించాలని చూడటం మంచి పద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకుని అరబిక్ ఎయిడెడ్ స్కూల్ స్థలానికి రక్షణ కల్పించడంతో పాటు ప్రహారీ నిర్మించాలని కోరారు. స్కూల్ కమిటీ చైర్మన్ డాక్టర్ అబ్దుల్ ఘనీ, ఉపాధ్యక్షుడు ఫిరోజ్‌ఖాన్, సీఎం.దాదా, సంయుక్త కార్యదర్శి అబ్దుల్‌సత్తార్, మతపెద్దలు, కౌన్సిలర్లు, మసీదు కమిటీల సభ్యులు, ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాగా స్కూల్ వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా వన్‌టౌన్ పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.

29న స్వరార్చన

తాడిపత్రి అర్బన్: గాన గంధర్వ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 78వ జయంతి వేడుకలను పురస్కరించుకుని ఈనెల 29న సాయంత్రం 6 గంటలకు పల్లవించనా గొంతులో అనే పేరుతో స్వరార్చన నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎస్పీ బాలు మ్యూజిక్ అకాడమీ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు స్నేహ భారతి సంగీత శిక్షణాలయ నిర్వాహకులు మహేష్‌స్వామి తెలిపారు.

విద్యా కిట్ల పంపిణీ



బాచుపల్లిలో విద్యార్థులకు కిట్లను అందిస్తున్న ఉపాధ్యాయులు

గుత్తి రూరల్: బాచుపల్లి గ్రామంలోని జంగాల కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యా కిట్లను పంపిణీ చేశారు. బుధవారం ముందుగా నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం శంకరయ్య మాట్లాడుతూ విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా చదువుకోవాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. ఉపాధ్యాయులు వేదవతి, కాంతారావు, జయకుమార్, ఆదిలక్ష్మమ్మ, జ్యోతికళ, నాగమణి, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పండ్లతోటల సాగుకు దరఖాస్తు చేసుకోండి

బుక్కరాయసముద్రం: ఉపాధి హామీ పథకం కింద 2024–25 సంవత్సరానికి సంబంధించి పండ్ల తోటల సాగుకు రైతుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏపీఓ పోలేరయ్య తెలిపారు. డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద చీనీ, మామిడి, నిమ్మ, జామ, సపోట, కొబ్బరి, దానిమ్మ, నేరేడు, సీతాఫలం వంటి పంట సాగుకు ప్రోత్సాహకం కల్పిస్తున్నామన్నారు. 5 ఎకరాల లోపు పొలం ఉన్న రైతులు ఈ పథకానికి అర్హులు అన్నారు. మండల రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మాదిగల ఆత్మగౌరవ కవాతు జయప్రదం చేయండి

తాడిపత్రి అర్బన్: జూలై 7న వరంగల్‌లో నిర్వహించనున్న మాదిగల ఆత్మగౌరవ కవాతును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ కో ఇన్‌చార్జ్ ఎంపీ పుల్లయ్య బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కవాతు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని మాదిగ ఉపకులాలకు చెందిన వారందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం



జూనియర్ కళాశాలలో మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్ మహమ్మద్ షఫి

శింగనమల: ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దామని ప్రిన్సిపాల్ మహమ్మద్ షఫి అన్నారు. బుధవారం శింగనమల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి సంరక్షించాలన్నారు. పర్యావరణంపై విద్యార్థులు కూడా వారి గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి, వారితో మొక్కలు నాటించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు చంద్రశేఖర్, హనుమంతు రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన 'అందరికీ రక్షణ శుభవార్త సభలు'

పామిడి: పట్టణంలో శాశ్వత కృపా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో మూడు రోజులుగానిర్వహిస్తున్న అందరికీ రక్షణ శుభవార్త సభలు బుధవారంతో ముగిశాయి. గుంటూరు యూదా మినిస్ట్రీస్ దైవజనుడు పాస్టర్ కే నెహమ్యా మాట్లాడుతూ అందరూ పాపం చేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేకపోతున్నారన్నారు. పాపులను రక్షించుటకు క్రీసుఏసు ఈ లోకానికి వచ్చాడన్నారు. లోకము, దాని ఆశలు గతించిపోవునన్నారు. నేత్రాశ, శరీరాశ, జీవపు డంబం దేవుని వలన పుట్టినవి కావన్నారు. ఈసందర్భంగా సింగింగ్ స్క్వయర్ టీమ్ ఆలపించిన దైవ సంకీర్తనాలాపనలు శ్రోతలను రంజింపజేశాయి. అనంతరం ప్రేమవిందు ఏర్పాటు చేశారు. మినిస్ట్రీస్ నిర్వాహకులు పీటర్ విజయ్, విజయ్ ఛార్లెస్, ప్రభాకర్ ఛార్లెస్, లూకా తదితరులు పాల్గొన్నారు.

దళిత రైతులను ఇబ్బంది పెట్టే వారిపై చర్యలు తీసుకోండి

గార్లదిన్నె: మండలంలో దళిత రైతులను ఇబ్బంది పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుళ్లాయప్ప కోరారు. బుధ వారం ఆయన మాట్లాడుతూ తిమ్మంపేటలో నారాయణ అనే దళిత రైతుకు సర్వే నంబర్219–1లో 3.11 ఎకరాల భూమి ఉందన్నారు. రైతు పొలంలో ఉన్న కంప చెట్లు తొలగించి భూమి సాగు చేస్తుండగా కొంత మంది రైతులు అడ్డు వచ్చి పొలం మధ్యలో రస్తా కావాలని అడుగుతున్నారన్నారు. రెవెన్యూ ప్లాన్ ప్రకారం ఎక్కడ ఉంటే అక్కడ వదులుతామని చెప్పినా రైతులు వినలేదన్నారు.పొలంలో వ్యవసాయ పనులు చేస్తుంటే అడ్డు చెబుతున్నారని వాపోయారు. ఈమేరకు స్థానిక పోలీస్ స్టేషన్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు.

రేషన్ డోర్ డెలివరీ చేయాలి



మాట్లాడుతున్న ఆర్‌డీఓ శ్రీనివాసులు రెడ్డి

గుంతకల్లు: వచ్చే నెల 1 నుంచి ఎండీయూ ఆపరేటర్లు రేషన్‌ను డోర్ టూ డోర్ డెలివరీ చేయాలని ఆర్‌డీఓ శ్రీనివాసులు రెడ్డి ఆదేశించారు. బుధవారం స్థానిక ఆర్‌డీఓ కార్యాలయంలో డివిజన్ స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 7.30 గంటల నుంచి పంపిణీ ప్రారంభించాలన్నారు. ఎండీయూ వాహనాలను తనిఖీలు నిర్వర్తించేలా సీఎస్‌డీటీలు ముందస్తు ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. రేషన్ పంపిణీలో అక్రమాలకు తావు లేకుండా చూడాలన్నారు. గుంతకల్లు, గుత్తి, పామిడి తహసీల్దార్లు శేషఫణి భారతి, చంద్రశేఖర్‌నాయక్, సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఆర్డీఓ స్థానిక మార్కెట్ యార్డులోని ఎంఎల్‌ఎస్ స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేశారు. ఈ నెల 30 లోపు ఎంఎల్‌ఎస్ స్టాక్ పాయింట్ నుంచి ఎఫ్‌పీ షాపులకు రేషన్ చేరేటట్లు చూడాలని స్టాక్ పాయింట్ ఇంచార్జ్‌ను ఆదేశించారు. తూకాలుల్లో హెచ్చుతగ్గులు లేకుండా చూసుకోవాలని, ఏవైనా తేడాలు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శింగనమల: ప్రజలకు రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ మోహన్‌బాబు సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని ప్రభుత్వ చౌకధాన్యపు డిపో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై నెలలో పాత డీలర్లకే రేషన్ సరఫరా చేస్తామన్నారు. వచ్చిన రేషన్‌ను ఎండీయూ మాపరేటర్లు పంపిణీ చేయాలన్నారు. సీఎస్‌డీటీ రాజశేఖర్, ఆర్‌ఐ హనుమాన్, రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి



యాడికిలో మాట్లాడుతున్న సీఐ నాగార్జున రెడ్డి



శింగనమలలో మాట్లాడుతున్న ఎస్‌ఐ చంద్రశేఖర్

శింగనమల: మత్తు పదార్థాలకు అందరూ దూరంగా ఉండాలని ఎస్‌ఐ చంద్రశేఖర్ సూచించారు. అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం శింగనమల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయస్సులోనే గంజాయి, గుట్కా, పానపరాగ్, మద్యం వంటి వాటికి బానిసలు కావొద్దన్నారు. సమాజంలో ఎలా వ్యవహరించాలో తెలియజేశారు. అంతకు ముందు విద్యార్థులతో కలిసి పోలీసులు ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుజాతమ్మ, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యాడికి: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని యాడికి అప్‌గ్రేడ్ పీఎస్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలతో జీవితం అంధకారమవుతుందన్నారు. యువత చదువుతో పాటు క్రీడలపై మక్కువ పెంచుకోవాలని, తద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. అంతకుమునుపు పోలీసులు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి బస్టాండు కూడలి వద్ద మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హరినాథరెడ్డి, అధ్యాపకులు బసవరాజు, నరసింహ గౌడ్, సుబ్బరాయుడు, జగ్గయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: మత్తు పదార్థాలతో ఎంతో మంది జీవితాలు నాశనమవుతున్నాయని, అందరూ వాటికి దూరంగా ఉండాలని ఇన్‌చార్జి ఎస్‌ఐగౌస్ బాషా అన్నారు. బుధవారం అంతర్జాతీయ మత్తుపదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వజూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భవిష్యత్తులో మత్తుపదార్థాల జోలికి తాము వెళ్లమని, మత్తుకు బానిసైన వారికి అవగాహన కల్గిస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు .కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శంకర్ ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

తాడిపత్రి అర్బన్: యువత మాదక ద్రవ్యాలకు అలవాటుపడితే బంగారు భవిష్యత్‌తో పాటు దేశ భవిష్యత్తు నాశనమవుతుందని సెబ్ సీఐ ఫణీంద్ర అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.